సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శుక్రవారం । 10 । జనవరి । 2025



టన్ను చీనీ రూ.24,190

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24,190, కనిష్టంగా రూ.5 వేలు, సరాసరిన రూ.16 వేల ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.11

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.11, కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.9 ప్రకారం ధర పలికింది.



జిల్లా పరిధిలో గురువారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ప్రభుత్వ వైఫల్యంతోనే తిరుపతి ఘటన

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్



పెనుకొండరూరల్: కూటమి ప్రభుత్వ వైఫల్యంతోనే తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతి చెందారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ అన్నారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ముక్కోటి ఏకాదశి టోకెన్ల పంపిణీలో ఇంత వరకూ ఎప్పుడూ భక్తులు చనిపోలేదన్నారు. ఇప్పుడు ఏకంగా ఆరుగురు చనిపోవడం, 40 మంది వరకూ గాయపడటం, కొందరి పరిస్థితి విషమంగా ఉండటం బాధాకరమన్నారు. వైకుంఠ ఏకాదశి రోజు తిరుమల వెంకన్న దర్శనం టోకెన్లు ఇస్తామంటే లక్షల్లో భక్తులు వస్తారని ప్రభుత్వం ముందే ఎందుకు ఊహించలేదో చెప్పాలన్నారు. 6, 7 తేదీల్లో సీఎం చంద్రబాబు కుప్పం పర్యటనకు పోలీసులందరినీ తరలించారని, అందుకే తిరుమలకు వెళ్లే భక్తులకు భద్రత ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులపై నెట్టడం సరికాదన్నారు. సనాతన ధర్మం పాటించే ఉప ముఖ్యమంత్రి పవన్‌కు భక్తుల బాధలు పట్టవా అని ప్రశ్నించారు.హిందూవులు అత్యంత పవిత్రంగా భావించే తిరుపతిలో భక్తులు మృతి చెందడం, ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. తొక్కిసలాట ఘటనకు కూటమి ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలన్నారు.

లింగ నిర్ధారణ నిషేధ చట్టంపై అవగాహన



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం

పుట్టపర్తి అర్బన్: లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి (పీసీపీఎన్‌డీటీ యాక్ట్–1994) ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని డీఎంహెచ్‌ఓ ఫైరోజ్‌బేగం పేర్కొన్నారు. రాష్ట్ర, జిల్లా, డివిజన్‌స్థాయి అడ్వైజరీ కమిటీలపై గురువారం జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల సీనియర్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ అడ్వైజరీ కమిటీ సభ్యుల అధికారాలు, పరిమితులను వివరించారు. చట్టం కింద వచ్చే ఫిర్యాదులను వెంటనే నిష్పక్షపాతంగా సాధ్యమయినంత వరకూ పోలీసుల ప్రమేయం లేకుండా పరిష్కరించాలన్నారు. సమీక్షలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు మంజువాణి, సెలియ్యా సాల్మన్, నివేదిత, డెమో బాబా ఫక్రుద్దీన్, ఎస్‌ఓ కళాధర్, తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

- కలెక్టర్ టీఎస్ చేతన్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ప్రశాంతి నిలయం: సంక్రాంతి పండుగ సందర్భంగా జిల్లాలో కోడి పందేలు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని కలెక్టర్ టీఎస్ చేతన్ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధకశాఖ అధికారులతో కలిసి 'కోడి పందేలు నిర్వహించడం పాల్గొనడం నేరం' కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. కోడిపందేలు నిర్వహించినా అందులో పాల్గొన్న శిక్ష తప్పదన్నారు.

నేటి నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

పుట్టపర్తి: జిల్లాలోని అన్ని పాఠశాలలకు శుక్రవారం నుంచి 19వ తేదీ వరకూ 10 రోజుల పాటు సంక్రాంతి సెలవులను ప్రభుత్వం ప్రకటించినట్లు డీఈఓ కృష్ణప్ప తెలిపారు. ఈ నెల 20వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు.


రేపు వడ్డే ఓబన్న జయంతి వేడుకలు

ప్రశాంతి నిలయం: స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి వేడుకలను ఈనెల 11న కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ టీఎస్ చేతన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు వడ్డే ఓబన్న చిత్రపటం వద్ద నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

పండగ పూటా.. పస్తులేనా?

1,367 జిల్లాలోని చౌకదుకాణాలు

5,72,609 లబ్ధిదారుల సంఖ్య



మరో ఐదు రోజుల్లో సంక్రాంతి పండగ రాబోతోంది. రాష్ట్రంలో ఎక్కువ మంది ఎంతో సంతోషంగా, ఉత్సాహంగా చేసుకొనే పండుగ కూడా ఇదే. అయితే కూటమి ప్రభుత్వం రేషన్ పంపిణీని సక్రమంగా చేపట్టకపోవడంతో పండుగ పూట కూడా పేదలు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొంది.

- అరకొరగా బియ్యం, చక్కెర మాత్రమే పంపిణీ చేసిన కూటమి ప్రభుత్వం
- లబ్ధిదారుల ఇంటికి చేరని కందిపప్పు
- మార్కెట్‌లో కిలో కంది పప్పు రూ.130 నుంచి రూ.180
- సంక్రాంతి వేళ పచ్చడి మెతుకులే తినాలా? అంటున్న లబ్ధిదారులు



అమడగూరు మండలంలో ఓ డిపోలో సంచి వేసి తూకం వేస్తున్న దృశ్యం

అమడగూరు: బయట మార్కెట్‌లో కిలో కందిపప్పు ధర రకాన్ని బట్టి రూ.130 నుంచి రూ.180 వరకూ ఉంది. పండుగకైనా రేషన్‌షాపుల్లో కందిపప్పు ఇస్తారులే అనుకున్న పేద ప్రజలకు కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. గత నెలలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అరకొరా షాపుల్లో సగం మందికి కందిపప్పును సరఫరా చేయగా, ఈ నెలలో కనీసం ఒక్కరికీ కూడా కందిపప్పు సరఫరా చేయలేదు. కేవలం బియ్యం, అరకిలో చక్కెర మాత్రం ఇచ్చి చేతులు దులుపుకుంది. దీంతో పెద్ద పండుగ సంక్రాంతికి పేదల ఇళ్లలో కందిపప్పు ఉడికే పరిస్థితి కనిపించడం లేదు.

అధిక ధరలకు రేషన్..

ప్రభుత్వం ఇచ్చే కమీషన్ చాలదన్నట్లు పలువురు డీలర్లు చేతివాటం చూపిస్తున్నారు. బియ్యం తూకం పెట్టే సమయంలో కిలో బరువున్న సంచిని స్కేలుపై ఉంచి తూకం వేస్తున్నారు. దీంతో పది కిలోలు బియ్యం తీసుకునే వారు కేవలం 9 కేజీలు మాత్రమే తీసుకెళ్తున్నారు. అరకిలో చక్కెర ధర రూ 17 ఉండగా లబ్ధిదారు నుంచి రూ.20 తీసుకుంటున్నారు. అలాగే కందిపప్పు ఇచ్చే సమయంలో కూడా కిలో పప్పు రూ.67 ఉండగా రూ.70 చొప్పున తీసుకుంటున్నారు. ఇలా ప్రతి లబ్ధిదారుడి నుంచి అదనంగా రూ.6 దోచేస్తున్నారు.

బ్లాక్‌లో కేజీ రూ.130..



ప్రతి నెలా లబ్ధిదారులందరికీ కందిపప్పుతో పాటుగా సరుకులన్నీ ఇవ్వాల్సిన కూటమి ప్రభుత్వం చేతులెత్తేసింది. దీంతో ప్రతి నెలా చౌకధాన్యపు డిపోల్లో సగం స్టోర్లకు గిడ్డంగిల నుంచి 70 శాతం కందిపప్పును సరఫరా చేస్తోంది. అయితే డీలర్లు మాత్రం లబ్ధిదారుల నుంచి వేలిముద్రను వేయించుకుని, సంబంధిత కార్డులో కందిపప్పును మంజూరు చేసి లబ్ధిదారుకు మాత్రం పప్పు ఇవ్వకుండా మిగిలిన సరుకులను ఇచ్చి పంపేస్తున్నారు. కందిపప్పు ఎందుకివ్వలేదని ప్రశ్నిస్తే స్టాకు తక్కువమందికే వచ్చిందని మీకు వచ్చే నెలలో ఇస్తామని పంపేస్తున్నారు. వచ్చిన 70 శాతం స్టాకులో 30–35 శాతం మాత్రమే పంపిణీ చేసి మిగిలిన స్టాకును లబ్ధిదారుడికి తెలీకుండా మంజూరు చేసుకుని, వారికి పప్పు ఇవ్వకుండా బ్లాక్‌మార్కెట్‌లో కేజీ రూ.130 తో అమ్మేసి సొమ్ము చేసుకుంటున్నారు.

సంక్రాంతి కిట్లు ఏవీ?

కందిపప్పుకే గతి లేకపోగా కూటమి నాయకులు, ప్రభుత్వ పెద్దలు మాత్రం సంక్రాంతి కిట్లు అంటూ ఇన్ని రోజులూ ఊదరగొట్టారు. మరో నాలుగు రోజుల్లో పండుగ ఉన్నా నేటికీ సంక్రాంతి కిట్ల పంపిణీపై మాత్రం ప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయలేదు. ఊరించి ఉసూరుమనిపించారని లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేయని పనులకు ప్రచారం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

ఇది ప్రభుత్వ వైఫల్యమే..



ప్రస్తుతం మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు అమాంతం పెరిగిపోయాయి. అయితే ప్రతి నెలా చౌకధాన్యపు డిపోల ద్వారా రేషన్ సరుకులన్నీ సబ్సిడీ ధరతో ఇవ్వాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పండుగకు కనీసం కందిపప్పు కూడా సరఫరా చేయకపోడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం.

– అదపాల వేమనారాయణ, సీపీఐ నేత

ప్రతినెలా ఎదురు చూడాల్సిందే



ప్రతి నెలా నిత్యావసరాల కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. కేవలం బియ్యం, అర కిలో చక్కెర ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. గత ప్రభుత్వంలో 7 రకాల వంట సరుకులు వచ్చేవి. మార్కెట్‌లో నిత్యావసరాలు కొని తినే పరిస్థితి చాలామందికి లేదు. దీనిపై ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది.

– ఎంజీ అశ్వర్థనారాయణ, కొత్తచెరువు

గతంలో అన్ని ఇచ్చేవారు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వంటకు అవసరమయ్యే బియ్యం, బెల్లం, వంట నూనె, రాగులు, జొన్నలు ఇలా 7 రకాల సరుకులు ప్రతి గ్రామానికి వెళ్లి ఇచ్చేవారు. అయితే ఈ కూటమి ప్రభుత్వం మాత్రం అన్నీ చేస్తున్నాం అంటున్నారు కానీ ఏమీ చేయలేకపోతోంది. ఒట్టి మాటల ప్రభుత్వంగా తయారవుతోంది. డీలర్లు కూడా మోసాలకు పాల్పడుతున్నా ఎవరికీ పట్టడంలేదు.

– శివారెడ్డి, మాజీ సర్పంచ్, లోకోజుపల్లి

పెండింగ్ పనులను పూర్తి చేయండి



భూసేకరణ పనులపై సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణకు సంబంధించి అన్ని పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్ లో జాతీయ రహదారులు, రైల్వేలైన్లు, ఆర్‌అండ్‌బీ , అటవీశాఖ , చిన్న నీటి పారుదల, భూసేకరణ తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరిగే భూసేకరణకు సంబంధించిన సమావేశాలకు కచ్చితంగా జాతీయ రహదారుల పీడీ హాజరు కావాలని ఆదేశించారు. లైన్ షిఫ్టింగ్, పెండింగ్ పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. చిలమత్తూరు, గోరంట్ల మండలంలోని చాగలేరు, బుక్కపట్నం, బూదిలి, గుమ్మయ్యగారిపల్లి మలకవేమల ప్రాంతాల్లో చేపట్టిన భూసేకరణ పనుల్లో నెలకొన్న సమస్యలను ఆయా మండలాల తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిష్కరించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా నష్టపరిహారం చెల్లింపులు జరగాలన్నారు. జాతీయ రహదారుల పీడీ అశోక్‌రెడ్డి, డీఈ గిడ్డయ్య, నేషనల్ హైవే మేనేజర్ ముత్యాలరావు, భూసేకరణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

రుణాలు విరివిగా ఇవ్వాలి

జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే పారిశ్రామిక వేత్తలకు రుణ సహాయం అందించి అన్ని విధాలా ప్రోత్సహించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పారిశ్రామికవాడల్లో ఇప్పటికే ప్లాట్లు కేటాయించిన వారితో పరిశ్రమలు నెలకొల్పేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా సిద్ధం చేయాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు 3,994 దరఖాస్తులు అందగా 3,883 ప్రతిపాదనలు ఆమోదించారు. 51 దరఖాస్తులు తిరస్కరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీ సహానీ, ఎల్‌డీఎం రమణకుమార్, డీపీఓ సుమత తదితరులు పాల్గొన్నారు.

నిన్ను ఎక్కడా పని చేయనివ్వను..

- సచివాలయ ఉద్యోగినికి ఏఓ వేధింపులు
- కలెక్టర్ ఆదేశాలతో అధికారుల విచారణ
- అధికారుల ముందు గోడు వెళ్లబోసుకున్న మహిళా ఉద్యోగి



విచారణ పారదర్శకంగా నిర్వహించాలని వినతిపత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు అంజనరెడ్డి

గోరంట్ల: 'నిన్ను ఎక్కడా మనశ్శాంతిగా ఉద్యోగం చేయనివ్వను' అంటూ వ్యవసాయాధికారి మునికృష్ణ తనను వేధించారంటూ సచివాలయ సెరికల్చర్ సహాయకురాలు దీప విచారణ అధికారుల ముందు తన గోడు వెళ్లబోసుకున్నారు. వివరాల్లోకెళితే... గోరంట్ల మండల పరిధిలోని వడిగేపల్లి గ్రామ సచివాలయంలో సెరికల్చర్ సహాయకురాలుగా దీప పనిచేస్తున్నారు. అయితే ఆరు నెలలుగా మండల వ్యవసాయాధికారి మునికృష్ణ తనను లైంగికంగా వేధించడంతో పాటు ఉద్యోగ రీత్యా ఇబ్బందులు పెడుతున్నారంటూ ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశించారు. దీంతో హిందూపురం పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకులు సురేష్‌కుమార్, పెనుకొండ డివిజనల్ వ్యవసాయ అధికారి స్వయంప్రభ గురువారం స్థానిక పట్టు పరిశ్రమశాఖ సహాయ సంచాలకుల కార్యాలయంలో విచారణ చేపట్టారు. బాధితురాలు దీపతో పాటు వారి కుటుంబ సభ్యులను కూడా విచారించి వారి వాంగ్మూలాన్ని రికార్డు చేశారు. అలాగే ఏఓ మునికృష్ణ వివరణ కూడా తీసుకున్నారు.

నా ప్రాణానికి ముప్పు ఉంది..

బాధిత ఉద్యోగి దీప తన గోడును విచారణ అధికారుల ముందు చెప్పుకున్నారు. వడిగేపల్లిలోని రైతు సేవ కేంద్రంలో ఒంటరిగా విధులు నిర్వహించే సమయంలో ఏఓ మునికృష్ణ విజిట్ పేరుతో వచ్చి అసభ్యంగా మాట్లాడేవారన్నారు. గంటల తరబడి వేధింపులకు గురిచేసేవారని, తన బాధను ఎవరికీ చెప్పుకోలేక మానసికంగా నరకం అనుభవించానని వాపోయారు. చివరికి ఉద్యోగానికి కూడా రాజీనామా చేశానని వెల్లడించారు. అయితే తన తల్లి, పట్టు పరిశ్రమశాఖ ఉన్నతాధికారులు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల యూనియన్ నాయకులు సపోర్టుతో రాజీనామాను ఉపసంహరించుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం పట్టు పరిశ్రమశాఖ ఉన్నతాధికారులు వడిగేపల్లి సచివాలయం నుంచి వేరే చోటికి డిప్యూటేషన్ చేశారన్నారు. అయితే తనపై కక్ష పెంచుకొన్న వ్యవసాయ అధికారి నో అబ్జక్షన్ సర్టిఫికెట్ మంజూరు చేయకపోగా... 'నువ్వు నా కళ్ల దగ్గరకు రావాల్సిందే.. నిన్ను ఎక్కడా మనశ్శాంతిగా ఉద్యోగం చేయనివ్వను' అంటూ బెదిరించారన్నారు. మునికృష్ణ వల్ల తన ప్రాణానికి ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

దీపకు అండగా ఉద్యోగుల సంఘం నాయకులు

బాధిత ఉద్యోగి దీపకు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు అండగా నిలిచారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు అంజనరెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు అక్కడికి చేరుకొని విచారణ పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. సచివాలయ మహిళా ఉద్యోగులపై రోజురోజుకూ వేధింపులు అధికమయ్యాయన్నారు. వేధింపులకు చెక్ పెట్టేందుకు ఉన్నతాధికారులు కృషిచేయాలన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్తామని అంజనరెడ్డి విచారణ అధికారులకు తెలిపారు. జరిగిన ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిస్తామని విచారణాధికారులు తెలిపారు.

'ముక్కోటి' శోభ



కదిరి నృసింహుని ఆలయంలో ముస్తాబైన ఉత్తర ద్వారం



ఖాద్రీ ఆలయం దగ్గర బారికేడ్లను పరిశీలిస్తున్న ఎస్పీ రత్న

జిల్లాలోని వైష్ణవ దేవాలయాలకు ముక్కోటి శోభ వచ్చింది. ఆయా ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో ఉత్తర ద్వారం నుంచి స్వామివార్లను దర్శించుకునేలా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ముఖ్యంగా కదిరి లక్ష్మీ నరసింహస్వామి, హిందూపురం పేట వెంకటరమణస్వామి, ధర్మవరం లక్ష్మీచెన్నకేశవ స్వామి, పుట్టపర్తి వేణుగోపాలస్వామి ఆలయం తదితర ఆలయాలు గురువారం అర్ధరాత్రి నుంచే భక్తులతో కిటకిటలాడాయి. కదిరి పట్టణంలోని ఖాద్రీశుడి ఆలయంలో ఏర్పాట్లను ఎస్పీ రత్న పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు.

– సాక్షిబృందం:



హిందూపురం: విద్యుత్ దీపాల అలంకరణలో పేట వెంకటరమణస్వామి ఆలయం



ధర్మవరం: ముస్తాబైన లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

అంగన్‌వాడీ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ కార్యకర్తలు, హెల్పర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ సుధావరలక్ష్మి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు 10వ తేదీ నుంచి జనవరి 25వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు గ్రామ/వార్డు సచివాలయాల్లో ఖాళీల వివరాలను తెలుసుకొని అక్కడే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు 10వ తరగతి పాసై ఉండాలని, 2024 జులై 01వ తేదీ నాటికి 21 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల్లోపు ఉండాలని సూచించారు. దరఖాస్తు చేసుకునేవారు వివాహితులై ఉండాలన్నారు. రూల్ ఆఫ్ రిజర్వేషన్ మేరకు పోస్టులు భర్తీ చేస్తామన్నారు.

క్లుప్తంగా

ఇసుక టిప్పర్ల పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన టిప్పర్లు

బత్తలపల్లి: చిత్రావతి నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఉదయం బత్తలపల్లి మండలం రామాపురం సమీపంలోని చిత్రావతి నది నుంచి రెండు టిప్పర్లలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్.. యర్రాయపల్లి క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతపురానికి చెందిన టిప్పర్ల యజమానిపై కేసు నమోదు చేశారు.

గ్రంథాలయాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి రమ

చెన్నేకొత్తపల్లి/తాడిమర్రి: సీకే పల్లి మండలం మేడాపురంతో పాటు మండల కేంద్రం తాడిమర్రిలోని గ్రంథాలయాలను జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ గురువారం తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయంలోని పుస్తకాల వివరాలు, పాఠకుల సంఖ్యను గ్రంథాలయాధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాయలంలో ఉన్న పుస్తకాలను సద్వినియోగం చేసుకోవాలని పాఠకులకు సూచించారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ అనుమానాస్పద మృతి



మృతురాలు నసీమా

హిందూపురం అర్బన్: స్థానిక మోడల్ కాలనీలో నివాసముంటున్న మేళాపురం ప్రాంతానికి చెందిన నసీమా (39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మోడల్ కాలనీ ఆశా వర్కర్‌గా ఆమె పనిచేస్తోంది. మొదటి భర్త షకీల్ వదిలేయడంతో కొంత కాలంగా హైదర్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. ఇద్దరు పిల్లలు ఉండగా వారు మేళాపురంలోని తమ తాత వద్ద ఉంటున్నారు. బుధవారం రాత్రి ఇంటి పై కప్పునకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో రెండో పట్టణ పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బంధువులు హైదర్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వాస్తవం నిగ్గు తేల్చండి..

ఆశా వర్కర్ నసీమా మృతిపై అనుమానాలు ఉన్నాయని, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి ఇందులోని వాస్తవాలు బహిర్గతం చేయాలని ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెండో పట్టణ సీఐ అబ్దుల్ కరీంకు బుధవారం వినతి పత్రం అందజేసి, మాట్లాడారు. నసీమా మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సాంబశివ, ప్రధాన కార్యదర్శి సౌభాగ్య, సహకార్యదర్శి రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కనకాంబరం.. కాసుల వర్షం

- పూల సాగుతో అధిక ఆదాయం గడిస్తున్న రైతులు
- ధరలు స్థిరంగా ఉండడంతో అన్నదాతల్లో హర్షం





చిల్లకొండయ్యపల్లిలో కనకాంబరం పూలను కోస్తున్న రైతులు

తాడిమర్రి: సొంత భూమి ఉన్న రైతులు సంవత్సరం పొడవునా ఆదాయం పొందాలంటే కనకాంబరం సాగు చేపట్టటం చాలా ఉత్తమని ప్రయోగాత్మకంగా నిరూపించారు తాడిమర్రి మండల రైతులు. వేరుశనగ, వరి తదితర సంప్రదాయ పంటల సాగులో నష్టపోయిన రైతులు ఇటీవల పూల సాగుపై దృష్టి సారించారు. ఈ క్రమంలోనే జిల్లాలో 380 ఎకరాల్లో కనకాంబరం పూల సాగులోకి వచ్చింది. ఇందులోనూ తాడిమర్రి మండలంలోని చిల్లకొండయ్యపల్లి, పుల్లానారాయణపల్లి, ఏకపాదంపల్లి, భీమరాయునిపేట, ఎం.అగ్రహారం, మర్రిమాకులపల్లి తదితర గ్రామాల్లో రైతులు అత్యధికంగా కనకాంబరం సాగునే చేపట్టారు.

కనకాంబరాలకు డిమాండ్ ఎక్కువ..

చెన్నై, బెంగుళూరు, తిరుపతి, హైదరాబాద్ తదితర నగరాల్లో కనకాంబరం పూలకు చాలా డిమాండ్ ఉంది. తాడిమర్రి మండలంలో కనకాంబరాలను సాగు చేసిన రైతులు దిగుబడులను బత్తలపల్లిలో పూల మండీల ద్వారా ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తుంటారు. జూన్ నుంచి డిసెంబర్ ఆఖరు వరకు సాధారణంగా ఉన్న ధరలు జనవరిలో తగ్గు ముఖం పడతాయి. కానీ, ఈ ఏడాది ఇప్పటికీ రైతులకు గిట్టుబాటు ధరనే లభ్యమవుతోంది.

సాగులో తలెత్తే ప్రధాన సమస్యలు..

కనకాంబరం సాగులో తలెత్తే ప్రధాన సమస్యల నివారణకు ఉద్యానవన శాఖ అధికారులు పలు సూచనలు చేస్తున్నారు. నులిపురుగుల సమస్య నివారణకు దుక్కిలో వేపపిండి వేసుకోవాలి. అలాగే కార్బోఫ్యూరాన్ 3–4 గుళికలను ఎకరానికి 400 గ్రాముల ప్రకారం ఇసుకలో కలిపి చల్లుకుంటే నులిపురుగు నివారణ సాధ్యమవుతుంది. పేనుబంక నివారణకు మిథైల్ డెమటాన్ లేదా డైమిథోయేట్ 2 ఎం.ఎల్.ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఎండు తెగులు నివారణకు ఎకరాకు 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండి, 2 కిలోల ట్రైకోడెర్మా విరిడి కలిపి 10 రోజుల పాటు నీడలో మగ్గబెట్టి తర్వాత దుక్కిలో వేసుకోవాలి. తెగులు సోకినట్లు కనిపిస్తే కాపర్ ఆక్సీ క్లోరైడ్ అర కిలో ఎకరానికి చొప్పున డ్రిప్పు ద్వారా అందించవచ్చు. లేదా, మొక్కలు తడిచేలా నేలను తడపితే సరిపోతుంది.

నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం

- కనకాంబరం సాగులో నీటి వాడకం తక్కువగా ఉంటుంది.
- సాధారణంగా కనకాంబరం పూలు ఏడాది పొడవునా కాస్తూనే ఉంటాయి.
- ఒకసారి నాటితే సుమారు మూడు, నాలుగేళ్ల పాటు పంట దిగుబడి వస్తుంది.
- పంటను సాగు చేసిన మూడు, నాలుగు నెలలకు కోతకు వస్తాయి.
- ఐదు రోజులకు ఒక కోత చొప్పున నెలకు ఆరు కోతలు ఉంటాయి.
- ఎకరా విస్తీర్ణంలో ప్రతి కోతకు 20 నుంచి 25 కిలోల పూల దిగుబడి ఉంటుంది.
- సాధారణ రోజుల్లో కిలో కనకాంబరాలు రూ.800 నుంచి రూ.వెయ్యి వరకు అమ్ముడుపోతాయి. పండుగ రోజుల్లో రూ.1,100 నుంచి రూ.1,200 వరకు ధర పలుకుతుంటాయి.
- ఐదు రోజులకు ఓ కోత చొప్పున నెలకు 6 కోతలతో రూ.లక్షకు పైగా ఆదాయం ఉంటుంది.
- అధిక దిగుబడులు, పూల నాణ్యతకు వేరుశనగ చెక్క, వేపపిండి, డీఏపీ తదితర ఎరువులను వాడాల్సి ఉంటుంది.

లాభాలు వస్తున్నాయి



ఆరు నెలల క్రితం ఒక ఎకరంలో కనకాంబరాల సాగు చేపట్టాను. మూడు నెలలుగా పూలు కోతకు వస్తున్నాయి. సేంద్రీయ ఎరువులు వాడాను దీంతో పూలు ఎంతో నాణ్యతగా ఉంటున్నాయి. కనకాంబరం సాగు ఎంతో లాభదాయకంగా ఉంది.

– చెడిపోతుల శివయ్య, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి

సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు ఇవ్వాలి



కనకాంబరం సాగుకు పెట్టుబడులు ఎక్కువ అవుతున్నాయి. ఒక ఎకరం విస్తీర్ణంలో పంటను సాగు చేయాలంటే విత్తనం, ఎరువులు, ఇతర పెట్టుబడుల కోసం సుమారు రూ.80 వేల వరకు ఖర్చు వస్తోంది. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనం, ఎరువులు అందిస్తే రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

– చిల్లా కాటమయ్య, చిల్లకొండయ్యపల్లి, తాడిమర్రి

రూ.16 వేలు రాయితీ ఇస్తాం



కనకాంబరాలు సాగుకు ముందుకు వచ్చే రైతులకు హెక్టారుకు రూ.16 వేలు చొప్పున రాయితీనిస్తాం. 25 సెంట్లలో సాగు చేసినా, అర ఎకరం, ఒక ఎకరంలో సాగు చేసినా సబ్సిడీ అందజేస్తాం. పంటను సాగు చేసిన ప్రతి రైతు సచివాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలి.

– అమరేశ్వరి, ఉద్యావన శాఖ అధికారి, ధర్మవరం డివిజన్

గొర్రెల మందపైకి దూసుకెళ్లిన ట్యాంకర్



రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన గొర్రెల కళేబరాలు



తీవ్రంగా గాయపడిన ఓబుళపతి

- అడ్డుపడ్డ గొర్రెల కాపరికీ తీవ్రగాయాలు
- 15 గొర్రెలు మృతి, మరో 25 గొర్రెలకు తీవ్రగాయాలు

బత్తలపల్లి: స్థానిక జాతీయ రహదారిపై ఓ ట్యాంకర్ భీభత్సాన్ని సృష్టించింది. గొర్రెల మందపైకి దూసుకెళ్లడంతో 15 జీవాలు అక్కడికక్కడే మృతి చెందాయి. అడ్డుకోబోయిన కాపరి సైతం తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు... బత్తలపల్లి మండలం కోడేకండ్ల గ్రామానికి చెందిన ఓబుళపతి జీవాల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం తన భార్య కామేశ్వరితో కలసి జీవాలను మేపునకు తోలుకు వెళ్లాడు. జ్వాలాపురం క్రాస్ వద్ద జాతీయ రహదారిని దాటిస్తున్న సమయంలో సేలం నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న ట్యాంకర్ దూసుకొస్తుండడం గమనించి ఓబుళపతి అడ్డుకోబోయాడు. అయినా డ్రైవర్ వేగాన్ని నియంత్రించుకోలేక కాపరిని ఢీకొని గొర్రెల మందపైకి దూసుకెళ్లడంతో అక్కడికక్కడే 15 గొర్రెలు మృతి చెందాయి. కళేబరాలు ఛిద్రమై రోడ్డుపై చెల్లాచెదురుగా పడ్డాయి. మరో 25 గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఓబుళపతి తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. కాపరి భార్య గట్టిగా కేకలు వేయడంతో పొలాల్లోని రైతులు, రోడ్డుపై వెళుతున్న వారు ట్యాంకర్‌ను అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో డ్రైవర్ వాహనాన్ని ఆపి అక్కడి నుంచి పారిపోయాడు. క్షతగాత్రుడిని స్థానికులు ఆర్డీటీ ఆస్పత్రికి తీసుకెళ్లగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, బాధిత గొర్రెల కాపరి కుటుంబాన్ని ఆదుకోవాలని సర్పంచ్ బండి సరస్వతి, ఎంపీటీసీ సభ్యురాలు బండి రాములమ్మతో పాటు పలువురు గ్రామస్తులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పశుసంవర్ధక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు స్పందించి స్థానిక అధికారులతో ఆరా తీసినట్లు సమాచారం. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ ద్వారా గొర్రెల కొనుగోలుకు రుణం అందించేందుకు అవకాశాలు పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది.

పట్టుకున్న ఇసుకనూ అమ్మేశారు!

- తెల్లవారకనే తరలించిన కొనుగోలుదారులు
- తహసీల్దార్ కారు డ్రైవరు కనుసన్నల్లో నడిచిన వ్యవహారం



ఇసుకను ట్రాక్టర్‌లోకి వేస్తున్న జేసీబీ

బత్తలపల్లి: ఇసుక అక్రమ తరలింపులను పోలీసులు అడ్డుకుని తహసీల్దార్‌కు అప్పగిస్తే... ఆ డంప్ మొత్తాన్ని రాత్రికి రాత్రే గుట్టు చప్పుడు కాకుండా విక్రయించి సొమ్ము చేసుకున్న వైనం బత్తలపల్లిలో హాట్ టాపిక్‌గా మారింది. వివరాలు... బత్తలపల్లి మండలంలోని చిత్రావతి నుంది నుంచి అక్రమంగా తరలిస్తున్న సుమారు పది టిప్పర్లకు పైగా ఇసుకను ఇటీవల పోలీసులు పట్టుకుని తహసీల్దార్‌కు స్వాధీనం చేశారు. ఈ ఇసుక మొత్తం తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డంప్ చేసి ఉంచారు. ఆ వాహనాలకు రెవెన్యూ అధికారులు జరిమానాలు విధించి పంపేశారు. అయితే ఇసుక డంప్‌పై కన్నేసిన తహసీల్దార్ కారు డ్రైవర్ దానిని బేరం పెట్టి మొత్తం రూ.60 వేలకు విక్రయించాడు. వచ్చిన మొత్తంలో రూ.30 వేలు మాత్రమే ప్రభుత్వానికి చలానా రూపంలో చెల్లించి, మిగిలిన రూ.30 వేలను స్వాహా చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇసుక కొనుగోలు చేసిన వ్యక్తి బుధవారం రాత్రి నుంచి గురువారం వేకువజాము లోపు జేసీబీ సాయంతో ట్రాక్టర్లలో తరలించేశారు. అయితే పోలీసులు పట్టుకున్న ఇసుకను ఇతరులకు అమ్మాలనుకుంటే మైనింగ్, సాండ్ అధికారులు ధర నిర్ణయించిన తరువాత వేలం వేస్తున్నట్లు పత్రికా ప్రకటనలు ఇవ్వాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా గుట్టుచప్పుడు ఇసుకను అమ్మేసినట్లుగా తెలుసుకున్న టీడీపీ నాయకులు కొందరు గురువారం ఉదయం తహసీల్దార్ స్వర్ణలతను నిలదీశారు. దీంతో కంగుతిన్న ఆమె ఉన్నతాధికారుల పేరు చెప్పి తప్పించుకోనే ప్రయత్నం చేశారు. ఇదే అంశంపై విలేకరులు అడిగిన ప్రశ్నకు తహసీల్దార్ మాట్లాడుతూ.. 'ఇసుకను అక్రమంగా అమ్ముకోలేదు. ఉన్నతాధికారులకు చెప్పే అమ్మాం. ఇక్కడ నిల్వ చేసిన ఇసుక 15 ట్రాక్టర్లకు సరిపోయింది. ఒక్కో ట్రాక్టర్ ఇసుకను రూ.2 వేల చొప్పున రూ.30వేలతో విక్రయించి, ప్రభుత్వ ఖజానాలో జమా చేశాం' అంటూ వివరణ ఇచ్చారు.

'ఉపాధి'లో వెలుగు చూసిన అవినీతి



రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయప్రసాద్

రొళ్ల: మండలంలో చేపట్టిన ఉపాధి పనుల్లో అక్రమాలు వెలుగు చూశాయి. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సాయంత్రం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. జిల్లా విజిలెన్స్ అధికారి నాగేశ్వరరావుతో పాటు డ్వామా పీడీ కె.విజయప్రసాద్ హాజరై ప్రొసిడింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి పథకం, పంచాయతీరాజ్‌శాఖలో పూర్తి చేసిన 577 పనులకు గాను రూ.4.51 కోట్లు ఖర్చు పెట్టారు. వెచ్చించిన నిధులకు చేపట్టిన పనులు సక్రమంగా ఉన్నాయా లేదా అనే విషయాన్ని వారం రోజులుగా డీఆర్పీలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి సిద్ధం చేసిన నివేదికలను ప్రజావేదికలో చదివి వినిపించారు. ఉపాధి పథకంలో రూ. 1,85,652 లక్షలు, పంచాయతీరాజ్‌శాఖలో రూ.23,527 వేలు మొత్తం రూ.2,09,179 లక్షలు దుర్వినియోగం అయినట్లు వెల్లడించారు. అనంతరం మడకశిర నియోజకవర్గంలోని వక్క, అరటి పంటలను ఉపాధి పథకానికి అనుసంధానం చేయాలని రత్నగిరి పంచాయతీ పరిధిలోని రైతులు జగన్నాథ్, శ్రీనివాసులు తదితరులు డ్వామా పీడీ కె.విజయప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీడీ లక్ష్మీనారాయణ, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రామారావు, ఎస్ఆర్పీ చంద్రమోహన్, ఏపీఓ ఓబుళప్ప, జేఈ మారేగౌడు, డీఆర్పీలు, టీఏలు, ఎఫ్ఏలు, వివిధ శాఖల అధికారులు, ఉపాధి సిబ్బంది, కూలీలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

మామిడి పూతను నిలుపుకోండి

- ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్



పూత దశలో ఉన్న మామిడి

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మామిడి తోటలు పూత దశకు చేరుకున్నందున మంచి దిగుబడులు సాధించేలా పూతను కాపాడుకోవాలని రైతులకు శ్రీసత్యసాయి జిల్లా ఉద్యానశాఖ డీడీ జి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. కీలక సమయంలో మేలైన యాజమాన్య పద్ధతులు, సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.

- తోటల్లో 10 శాతం చెట్లు కూడా పూత పట్టకుంటే ఒక నీటి తడి ఇచ్చి 10 గ్రాముల 13–0–45 + 2 గ్రాముల సూక్ష్మధాతు మిశ్రమాన్ని ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.
- 25 శాతం మేర పూత వచ్చివుంటే ఒక నీటి తడి ఇచ్చి 1 మి.లీ బ్రాసినోలిడ్ + 0.5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ + 2 మి.లీ హెక్సాకొనజోల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. .
- 50 శాతానికి పైబడి పూత వచ్చివున్న తోటల్లో 0.3 మి.లీ ప్లానోఫిక్ + 0.3 గ్రాముల థయోమిథాక్సామ్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు.
- 75 నుంచి 100 శాతం మేర పూత వచ్చివున్న తోటలు, అలాగే 10 శాతం పిందె పట్టిన తోటల్లో 0.3 మి.లీ స్పైనోసాడ్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకుంటే మంచి దిగుబడులు వస్తాయన్నారు.
- ఇక మామిడిని బాగా దెబ్బతీస్తున్న పండుఈగ నివారణకు ఇప్పటి నుంచి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. పండు ఈగను ఆకర్షించే బుట్టలు లేదా మీథైల్ యూజినాల్ టాబ్లెట్స్ లేదా జెల్ ఎకరాకు 5 బుట్టలు కడితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు.

12న రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడు రూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 12న రెడ్డి వివాహ పరిచయ వేదిక ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు రెడ్డి జన సంఘం వ్యవస్థాపకులు రొద్దం సురేష్‌రెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం రూరల్ పరిధిలోని పాపంపేట బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుక ఉన్న సంఘం కార్యాలయంలో రెడ్డి వివాహ పరిచయ వేదికను ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న వారు పిల్లల బయోడేటాతో హాజరు కావాలి. పూర్తి వివరాలకు చంద్రమౌళీరెడ్డి, దుబ్బిర కిషోర్‌రెడ్డి (93902 84296), తోపుదుర్తి రామకృష్ణారెడ్డి (94907 67224), మంత్రి విశ్వనాథ్‌రెడ్డి (99891 38044)ను సంప్రదించవచ్చు.

వృద్ధురాలిని మోసగించి బంగారం అపహరణ



రోదిస్తున్న వృద్ధురాలు నారాయణమ్మ

యాడికి: ఓ వృద్ధురాలిని మోసగించి ఆమె మెడలోని బంగారం గొలుసును దుండగుడు అపహరించుకెళ్లిన యాడికి మండలం చందన గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు.. చందన గ్రామంలో ఈ నెల 14, 15 తేదీల్లో చౌడేశ్వరీ జ్యోతుల ఉత్సవాలు జరగనున్నాయి. ఈ క్రమంలో గ్రామంలోని చాలా మంది ఇళ్లను సుందరంగా ముస్తాబు చేసుకుంటున్నారు. గురువారం మధ్యాహ్నం తపాలా కార్యాలయం సమీపంలో ఒంటరిగా ఉన్న 70 ఏళ్ల వయసున్న నారాయణమ్మను ఓ ఆగంతకుడు కలసి తాను బంగారు, వెండి గొలుసులకు మెరుగు పెడతానని చెప్పాడు. గ్రామంలో చాలా మంది తమ వద్ద ఉన్న పాత నగలకు మెరుగు పట్టించారని నమ్మబలికాడు. దీంతో నారాయణమ్మ తన మెడలోని 2 తులాల బంగారు గొలుసు తీసి మెరుగు పట్టాలని దుండగుడికి ఇచ్చింది. ఆమె కంటి ముందే ఓ గిన్నెలోకి గొలుసు వేసి పసుపు రంగు ద్రావకం కలిపాడు. అనంతరం గొలుసు బయటకు తీసి బ్రష్ చేసి, కడిగిన తర్వాత ఆమె దృష్టి ఏమారుస్తూ ఓ గిన్నెలోకి నకిలీ బంగారం గొలుసు వేసి ఓ గంట ఆగిన తర్వాత తీయాలని సూచించి, తన ఫీజు రూ.100 వసూలు చేసుకుని వెళ్లిపోయాడు. గంట తర్వాత ఇరుగు పొరుగు వారితో తాను బంగారు గొలుసుకు మెరుగు పెట్టించానని, బాగుందో లేదో చెప్పాలంటూ నారాయణమ్మ చూపించింది. చూసిన వారంతా అది గిల్టు నగ అని తెలపడంతో వృద్ధురాలి వేదనకు అంతులేకుండా పోయింది. విషయం తెలుసుకున్న సచివాలయ మహిళా పోలీసు జీవిత అక్కడకు చేరుకుని ఆరా తీశారు. సాయంత్రం నారాయణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వైకుంఠ ఏకాదశికి పటిష్ట భద్రత : ఎస్పీ

పుట్టపర్తి టౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా భక్తుల రద్దీ ఉన్న ఆలయాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ రత్న తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లు చేసుకోవాలని ఆలయ కమిటీలకు సూచనలు చేశారు. కదిరి, మడకశిర, హిందూపురం, కొత్తచెరువు తదితర ప్రాంతాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల వద్ద భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు. డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా చేపట్టనున్నారు.

రియల్టర్ మిస్సింగ్



నరేష్

హిందూపురం అర్బన్: స్థానిక శ్రీకంఠపురానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి నరేష్ కనిపించడం లేదు. తొలుత ప్యూరిఫైడ్ వాటర్ వ్యాపారం సాగించే ఆయన రాజకీయాల్లోకి ప్రవేశించి తొలుత టీడీపీలో, అనంతరం వైఎస్సార్‌సీపీలో పనిచేశారు. గత ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి పరిపూర్ణానంద స్వామికి మద్దతుగా పనిచేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించిన తర్వాత కర్ణాటకలోని గౌరీబిదనూరు, చిక్కబళాపురంలో కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని తన వ్యాపారాన్ని విస్తరించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురై గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాకపోవడంతో గురువారం ఉదయం భార్య మంగళగౌరి చేసిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు సీఐ అబ్దుల్ కరీం తెలిపారు.

చుక్కలూరు వద్ద దారిదోపిడీ

తాడిపత్రి రూరల్: ఆటోలో వెళుతున్న ఓ మహిళను అడ్డుకుని దారిదోపిడీ చేసిన ఘటన తాడిపత్రిలో సంచలనం రేకెత్తించింది. వివరాలు... తాడిపత్రి సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో నివాసం ఉంటున్న రేణుక వ్యవసాయ కూలీగా జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం తోటి కూలీలతో కలసి ఆటోలో యుగుడూరుకు పొలం పనుల కోసం బయలుదేరింది. చుక్కలూరు సమీపంలో ప్రయాణిస్తున్న ఆటోను స్కార్పియో వాహనంలో వచ్చిన ముగ్గురు వ్యక్తులు అడ్డుకున్నారు. అనంతరం రేణుకను బలవంతంగా ఎత్తుకెళ్లి ఆమె వద్ద శరీరంపై ఉన్న బంగారు కమ్మలు, చైన్, మాటీలను లాక్కొని పులిప్రొద్దుటూరు వద్ద వదిలి ఉడాయించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శివగంగాధరరెడ్డి తెలిపారు. కాగా, విచారణలో బాధితురాలు, నిందితుల మధ్య పాత కక్షలతో పాటు ఆర్థిక లావాదేవీలు ఉన్నాయని తేలింది.

వీసీ పోస్టులకు దరఖాస్తుల వెల్లువ

- ఎస్కేయూలో పోటీ పడిన 97 మంది
- జేఎన్‌టీయూఏ నుంచి బరిలో 112 మంది

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూఏ వైస్ చాన్సలర్ పోస్టు దక్కించుకునేందుకు పలువురు పోటీ పడ్డారు. ఆయా వర్సిటీలకు వీసీల నియామకానికి ప్రభుత్వం సెర్చ్ కమిటీలను నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోస్టులు దక్కించుకునేందుకు ఎవరికి వారు పోటీ పడ్డారు. ఎస్కేయూ నుంచి 97, జేఎన్‌టీయూఏ నుంచి 112 దరఖాస్తులు అందాయి. కాగా, 1982లో స్వయం ప్రతిపత్తితో ఏర్పడిన శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి ఇప్పటి వరకూ 12 మంది వీసీలు పనిచేశారు. అయితే ఇప్పటి వరకూ బీసీ వర్గానికి వీసీ హోదా దక్కలేదు. ఓసీ, ఎస్సీ కేటగిరికి చెందిన వారికే కేటాయిస్తూ వచ్చారు. తాజాగా బీసీలకు వీసీ పదవి అప్పగించాలనే డిమాండ్ వినిపిస్తోంది. గత ప్రభుత్వంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారికి జేఎన్‌టీయూఏ వీసీ బాధ్యతలు అప్పగించారు. పాలకమండలి భర్తీలోనూ అప్పట్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ కేటగిరి వారితో పాటు మహిళలకూ 50 శాతం స్థానాలు కల్పించారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడండి

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా ఎక్కడేగాని తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ శివశంకరప్పకు జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి సూచించారు. డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్యతో కలసి గురువారం ఆయన సీకేపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని తనిఖీ చేవారు. రికార్డులను పరిశీలించిన అనంతరం మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను ఎంపీడీఓతో ఆరా తీశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీగా 'బత్తలపల్లి'

బత్తలపల్లి: స్థానిక గ్రామ పంచాయతీని మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీగా ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ నరసింహనాయుడు తెలిపారు. ఎస్ఐఆర్‌డీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ డీపీఓ నిర్మల్‌ప్రకాష్ గురువారం బత్తలపల్లి గ్రామ పంచాయతీలో స్థానిక అధికారులు ప్రజాప్రతినిధులతో సమావేశమై మాట్లాడారు. సర్పంచ్ అక్కిం కాశమ్మ, మండల పరిషత్‌లో ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జిల్లా ప్రాదేశిక సభ్యురాలిగా సుధ ఎన్నికయ్యారన్నారు. అలాగే పొదుపు సంఘాల మహిళల ఆధ్వర్యంలో మహిళా మార్ట్‌ను నిర్వహిస్తున్నారన్నారు. మహిళలు, మండల అధికారులు సమన్వయం చేసుకొని పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. తద్వారా ప్రోత్సాహక బహుమతి కింద రూ.కోటి ఇస్తారని తెలియజేశారు. అంతకు ముందు ఎంపీడీఓ కార్యాలయం, గ్రామ సచివాలయం, ఐకేపీ కార్యాలయంలో అధికారులతో, మహిళలతో వారు సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఎఓ శ్రీనివాసులు, ఏపీఎం సుదర్శన్‌రాజు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పొదుపు సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.